క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో కొటేషన్లకు ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో దీక్షలను పురస్కరించుకొని దీక్షా సమయంలో అన్నదానం, టీ, అల్పాహారం ఏర్పాటు చేసేందుకు పాలు, పెరుగు, నెయ్యి సరఫరాకు కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

వెంకన్న ఆలయంలో టెండర్లకు ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్ వేంకటేశ్వరాలయంలో 2024 నుంచి 2025 వరకు ఒక సంవత్సరం కాలపరిమితికి గాను టెంకాయలు, వాహన పూజలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు బహిరంగ వేలంలో భాగంగా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఈవో ఉడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న మధ్యాహ్నం 12 గంటలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి ఉన్నవారు వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న మల్లయ్య

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆర్టీసీ టూ డిపో పరిధిలో అక్టోబర్ నెలలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు కేజీ సాగర్, వి.రాజన్న, డ్రైవర్లు డీఎం రెడ్డి, పి.అశోక్‌రావు, కె.శంకరయ్య, కండక్టర్ వినోదను ఆ డిపోలో బుధవారం డిపో మేనేజర్ మల్లయ్య ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ కమల, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభకు తరలిరావాలి



సింగాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు కోసం హైదరాబాద్‌లో 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. తుమ్మనపల్లి, మాందాడిపల్లి, సింగాపూర్ గ్రామాల్లో బుధవారం సభకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. సభకు ఏపీ, తెలంగాణ నుంచి వేలాది మందితరలి వస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ రామచంద్రం, కో కన్వీనర్ మారెపల్లి శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి తునికి వసంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలపల్లి గ్రామంలో..

గంగాధర: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కోసం 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీయస్ నాయకులు పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన పోస్టర్ మండలంలోని ర్యాలపల్లి గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు, బెజ్జంకి అనిల్, నర్సయ్య, ఎల్లయ్య, ఎలగందుల మల్లయ్య, గసికంటి అమృత, సామర్ల అమృత, బెజ్జంకి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలపల్లి గ్రామంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా వారధి..!

- రేకుర్తి వంతెనపై గుంతలు
- ఆందోళనలో వాహనదారులు
- దృష్టి సారించని అధికారులు



రేకుర్తి వంతెనపై గుంతలు

కొత్తపల్లి: నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డది. గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కరీంనగర్ శివారు రేకుర్తిలోని పురాతన వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న వంతెనపై గుంతలు ఏర్పడడంతో.. ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గతంలో కురిసిన వర్షాల కారణంగా వంతెనపై ఏర్పడ్డ గుంతలు రోజురోజుకు పెద్దవిగా మారి ప్రయాణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ వంతెన అధ్వాన స్థితిపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా అనేక ప్రమాదాలకు రేకుర్తి బ్రిడ్జి కేంద్ర బిందువుగా మారుతుండడం ప్రయాణికులను భయాందోళనలకు గురి చేస్తోంది. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిని కలిపే ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. మేజర్ ప్రమాదాలు జరిగినప్పుడు తాత్కాలికంగా స్పందించడం.. మళ్లీ ఆ వంతెన నిర్వహణ గాలికొదలడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో ఈ వంతెనపై రాకపోకలను కొన్ని రోజుల పాటు నిలిపేశారు. గతంలో ప్రమాదాల మూలంగా సైడ్ బరమ్స్ కూలడం, ఇనుప కంచె విరగడం వంటివి జరిగాయి. ప్రస్తుతం ఇదే వంతెనపై ఏర్పడ్డ గుంతల కారణంగా వేగంగా వస్తున్న వాహనదారులు ఒక్కసారిగా బ్రేకులు వేస్తుండటంతో.. వెనక వచ్చే వాహనాలు కంట్రోల్ కాక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారించి వంతెనపై మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేలాది వాహనాలు..

కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై పాత వంతెన మీదుగా జగిత్యాల వైపు నుంచి వచ్చే వాహనాలు ప్రయాణిస్తుంటాయి. నిత్యం ఈ రహదారిపై వేలాది వాహనాలు వెళ్తుంటాయి. తరచూ రేకుర్తి వంతెన సమీపంలోనే ప్రమాదాలు అధికంగా జరుగుతుండడం తెలిసిందే. చాలామంది చనిపోగా.. మరికొంతమంది గాయాలబారిన పడి బయటపడ్డారు. ఇరుగ్గా ఉన్న వంతెన గోడలు దెబ్బతినడం.. ఇరువైపులా రక్షణగా ఏర్పాటు చేసిన సైడ్‌బరమ్స్‌ను వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ఆ వంతెనపై ఏర్పడ్డ గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వేగంగా వచ్చే వాహనాలు ఆ గుంతల్లో పడి అదుపుతప్పే ప్రమాదం లేకపోలేదు. ఇకనైనా ప్రయాణికుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న స్నేహితులు

జమ్మికుంట: పట్టణానికి చెందిన మహదేవుని భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1989–90 పదో తరగతి విద్యార్థులు బుధవారం మృతుడి భార్య దుర్గాభవాని, కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో గుడివాడ సతీశ్, అయిత కృష్ణమూర్తి, శ్రీనివాస్, మంచాల రాంబాబు, అయిత రాధాకృష్ణ, దొడ్డె శ్యామ్, కొండ్లె నగేశ్, రాజు, రావికంటి శ్రీధర్, శ్రీమోజు రాజేంద్రప్రసాద్, మహదేవుని శేఖర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌లో బాలల హక్కుల వారోత్సవాలు



పిల్లలకు నామకరణం చేస్తున్న సరస్వతి

కరీంనగర్: బాలసదన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజులు జరుపుకునే బాలల హక్కుల వారోత్సవాలను ఇండోర్ గేమ్స్ పెయింటింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ తదితర ఆటలను బుధవారం జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ప్రారంభించారు. అనంతరం శిశుగృహలో ఇద్దరు చిన్న పిల్లలకు నామకరణం చేశారు. ఈ వారోత్సవాలు ఈనెల 14 వరకు వివిధ ఆటపాటలతో జరుగుతాయని అన్నారు. డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, బాలల సంక్షేమ సమితి సభ్యులు శేఖర్, రాధ అర్చన, సీనియర్ అసిస్టెంట్ రాధిక, ఈవో మమత, బాలసదన్ సూపరింటెండెంట్ సంతోషి, శిశుగృహ మేనేజర్ తేజస్విని, చైల్డ్ హెల్ప్ లైన్ టీం పుష్పలత, సాయికిరణ్, ప్రియాంక, అకౌంటెంట్ వాణి, ఏఎన్ఎం రమ, కౌన్సిలర్ కీర్తి, పిల్లలు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనందిస్తా



నామినేషన్ దాఖలు చేస్తున్న అంబటి జోజిరెడ్డి

కరీంనగర్: కరీంనగర్ అసెంబ్లీకి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులంతా ఒక్కటేనని, అవినీతిలో వారంతా భాగస్వాములేనని, తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అవినీతి రహిత పాలనందిస్తానని ఏఐఎఫ్‌బీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కలెక్టరేట్ ఎదుట మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సమ సమాజ స్థాపన కోసం అవినీతి నేర రహిత పాలన కోసం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని బలపర్చాలని కోరారు. నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు నంబర్లు



మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రం నంబరు వేయిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: శాసనసభ ఎన్నికలకు అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 30న నిర్వహించే పోలింగ్ సందర్భంగా ఓటేసేందుకు వచ్చే ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలిసేలా చర్యలు చేపట్టారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నవాళ్లతో పాటు జాబితాలో మార్పులు చేసుకున్నవారు కేంద్రాలను గుర్తించేలా పోలింగ్ కేంద్రం ఎదుట గుర్తింపు నెంబర్లను వేయిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలుండగా.. కరీంనగర్ రూరల్‌లో 66, కరీంనగర్ కార్పొరేషన్‌లో 263, కొత్తపల్లి మండలంలో 61 ఉన్నాయి. ఎన్నికల సంఘం కరీంనగర్ నియోజకవర్గానికి గుర్తింపు సంఖ్య 26 కేటాయించింది. 4రోజుల నుంచి ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు అందరికీ కనబడేలా సంఖ్య రాయిస్తున్నారు. కేంద్రాల్లో గోడలపై మీద పోలింగ్ కేంద్రం సంఖ్య, కింద అసెంబ్లీ నియోజకవర్గం సంఖ్య వేశారు.

రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



పరీక్షలు చేస్తున్న పశు వైద్యులు

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 65 గేదెలు, 80 ఆవులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పాడి పశువుల పునరుత్పత్తి వ్యవస్థ లోపాల పునరుద్ధరణ నైపుణ్యాల పెంపొందింపు అంశంపై తెలంగాణా రాష్ట్ర పశు వైద్యాధికారులకు పదిరోజుల పాటు కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేశామని మండల పశువైద్యాధికారి సురేందర్ రెడ్డి తెలిపారు. శిబిరంలో శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. లింగారెడ్డి, డాక్టర్ జి.విజయకుమార్ శర్మ, ఎస్పీరెడ్డి, రాజిరెడ్డి, శిక్షణా కేంద్రం అధ్యాపకులు ఎం. కోటేశ్వరరావు, సాయిచైతన్య, దివ్య, మండల పశువైద్య సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు, బైక్

తిమ్మాపూర్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మానకొండూరు మండలం కొండపలకల గ్రామంలో బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై 27 మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు సరిత, శ్రీకాంత్ సిబ్బంది కొండల్ రెడ్డి, రాజేశం, నరేశ్, సురేశ్, రజిత పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

- ఎఫ్‌డీసీ చైర్మన్ కుర్మాచలం అనిల్



మాట్లాడుతున్న అనిల్

కరీంనగర్: తల్లిచేతిలో బిడ్డ ఎంత క్షేమంగా ఉంటుందో… సీఎం కేసీఆర్ చేతిలో తెలంగాణ అంతే క్షేమంగా ఉంటుందని, సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎఫ్‌డీసీ చైర్మన్, ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ ఫౌండర్ కుర్మాచలం అనిల్ అన్నారు. బుధవారం మీసేవా కార్యాలయంలో మాట్లాడుతూ వివిధ దేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలమంతా తమవంతు ప్రయత్నం చేసి రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యామని అన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లల్లోనే ఎంతో అభివృద్ధి జరిగిందని, సీఎం కేసీఆర్ చలువతోనే సాధ్యమైందని అన్నారు. ఎన్ఆర్ఐలుగా రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రచారం చేపట్టేందుకు వచ్చామని అన్నారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల హయంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని అన్నారు. ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్‌లో పది నిమిషాలు కూడా ఈ ప్రాంత సమస్యలు గురించి మాట్లాడలేదని పైగా మరోసారి ఎమ్మెల్యేగా కరీంనగర్ నుంచి పోటీ చేస్తూ అభివృద్ధి కాముకుడైన మంత్రి గంగులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఎన్ఆర్ఐలు కె.రత్నాకర్, పి.ప్రవీణ్, మారుతి, మల్లేశ్, తేజ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం వసూలు చేయాలి

- డీపీవో వీరబుచ్చయ్య



మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో పది రోజుల్లో వందశాతం పన్నులు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కరీంనగర్, కొత్తపల్లి, మానకొండూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులతో పన్నుల వసూళ్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ..వసూలు చేసిన పన్నుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో దుకాణాల లైసెన్స్ ఫీజుల వసూలు చేసి పంచాయతీల ఆదాయం పెంచాలని సూచించారు. వీధిదీపాలు, తాగునీటి సరఫరా బావుల విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించి ట్రాక్టర్‌లో కంపోస్ట్‌షెడ్‌కు తరలించడంతో పాటు సేంద్రియ ఎరువును తయారు చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో డీఎల్పీవో లత, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ఎంపీవోలు జగన్మోహన్ రెడ్డి, రాజేశ్వర్‌రావు, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, రమేశ్, కల్యాణి, ఆయా మండలాల పంచాయతీ కార్యదర్శులు, తదితులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి: వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా సమస్యలపై దృష్టిసారించాలని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వి.గంగాధర్ సూచించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన హుజూరాబాద్ డివిజన్, సబ్ డివిజన్, ఓ అండ్ ఎం సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో లోపాలు లేకుండా వెనువెంటనే పరిష్కరించాలని, బ్రేక్ డౌన్ రాకుండా లైన్లు ఎప్పటికప్పుడు సరిచేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈలు విజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



గంగాధర: ప్రధాన రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండలంలోని మధురానగర్ చౌరస్తా నుంచి బోయినపల్లి వరకు ఇటీవల డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి దాదాపు కిలో మీటరు వరకు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించారు. బోయినపల్లి రోడ్డు కుడివైపు దారిని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు తొలిగించకుండానే రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు తొలిగించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.